సీఎంఆర్‌సెట్ అసిస్టెంట్ ప్రొఫెసర్‌కు డాక్టరేట్


ప్రొఫెసర్ నరసింహ

మేడ్చల్‌రూరల్: గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ పరిధి కండ్లకోయలోని సీఎంఆర్‌సెట్ కళాశాల అధ్యాపకుడు వడ్డె నరసింహకు జేఎన్‌టీయూహెచ్ డాక్టరేట్ ప్రదానం చేసింది. సీఎంఆర్‌సెట్ కళాశాలలో సీఎస్‌ఈ విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్న ఆయన ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ విభాగం ప్రొఫెసర్ ధనలక్ష్మి పర్యవేక్షణలో 'సివియారిటీ ప్రిడిక్షన్ ఆన్ చెస్ట్ ఎక్స్‌రే ఫర్ కోవిడ్–19 యూసింగ్ మెషిన్ లర్నింగ్ టెక్నిక్' అనే అంశంపై పరిశోధన చేశారు. దీనికి జేఎన్‌టీయూహెచ్ డాక్టరేట్ ప్రదానం చేయగా.. బుధవారం కళాశాల చైర్మన్ గోపాల్‌రెడ్డి, సీఈఓ అభినవ్‌రెడ్డి, డైరెక్టర్ నారాయణ, ప్రిన్సిపాల్ శేషుకుమార్, అధ్యాపకులు అసిస్టెంట్ ప్రొఫెసర్‌ను సత్కరించి అభినందించారు.

నీటి సరఫరా సమస్యను పరిష్కరించండి



కీసర: నాగారం మున్సిపాలిటీ పరిధిలోని రాజ్ సుఖ్‌నగర్‌లో జలమండలి కార్యాలయం ప్రారంభమైంది. మున్సిపల్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి, 16వ వార్డు అధ్యక్షుడు వేణుగోపాల్‌తో కలిసి బుధవారం జలమండలి డైరెక్టర్ అమరేందర్‌రెడ్డి, జనరల్ మేనేజర్ శ్రీనివాస్‌రెడ్డిలను కలిసి నీటి సరఫరా సమస్యను మెరుగుపరచాలని కోరారు. రాజ్ సుఖ్‌నగర్ కాలనీ అధ్యక్షులు దాసు, కాంగ్రెస్ నాయకులు బాబురావు, మాదిరెడ్డి రాజిరెడ్డి తదితరులున్నారు.

భూ భారతి చట్టంతో భూ సమస్యలకు పరిష్కారం

మేడ్చల్ జిల్లా కలెక్టర్ గౌతమ్


మాట్లాడుతున్న మేడ్చల్ జిల్లా కలెక్టర్ గౌతమ్

మేడిపల్లి: భూ భారతి చట్టంతో భూ సమస్యలను పరిష్కరించుకోవచ్చని మేడ్చల్ జిల్లా కలెక్టర్ గౌతమ్ పేర్కొన్నారు. మేడిపల్లి మండలం పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ కౌన్సిల్ హాల్‌లో బుధవారం అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. అదనపు కలెక్టర్‌తో కలిసి ఆయన హాజరయ్యారు. పలువురి సందేహాలను నివృత్తి చేశారు. రెవెన్యూ రికార్డుల్లో తప్పులుంటే తహసీల్దార్, ఆర్డీవో, జాయింట్ కలెక్టర్, కలెక్టర్‌కు అప్పీల్ చేసుకునే అవకాశం భూ భారతిలో ఉందన్నారు. ఎవరికైనా భూ సమస్యలు ఉంటే రెవెన్యూ సదస్సులు, ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. జీపీఏ, మ్యూటేషన్ తదితర అంశాలను క్షుణ్ణంగా వివరించారు. ప్రభుత్వం నుంచి ప్రస్తుతం సెమీ గైడ్‌లైన్స్ మాత్రమే వచ్చాయని, పూర్తి మార్గ దర్శకాలు వచ్చిన తర్వాత మరింత అవగాహన కల్పిస్తామని తెలిపారు. కార్యక్రమంలో మేడ్చల్ జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్ రెడ్డి, మున్సిపల్ కమిషనర్ త్రిలేశ్వర్ రావు, రెవెన్యూ అధికారులు, రైతులు, పీర్జాదిగూడ ప్రజలు పాల్గొన్నారు.

ప్రిన్సిపాల్‌ను తొలగించాలని టీచర్ల ఆందోళన


ఆందోళన చేస్తున్న టీచర్లు, టీపీటీఎఫ్ సంస్థ ప్రతినిధులు

ఉప్పల్: ఓ ప్రైవేటు విద్యాసంస్థ ప్రిన్సిపాల్‌ను తొలగించాలంటూ పాఠశాల ఉపాధ్యాయులు పాఠశాల ఎదుట నిరసన చేపట్టారు. టీచర్లు చేస్తున్న న్యాయమైన ఆందోళనకు మద్దతుగా (టీపీటీఎఫ్) తెలంగాణ ప్రైవేట్ టీచర్స్ ఫోరం మద్దతు తెలిపింది. ఉప్పల్ ట్రీట్‌మెంట్ ప్లాంట్ వద్ద ఈ మధ్యకాలంలో వెలిసిన విద్యాసంస్థ శాఖలో ప్రిన్సిపాల్‌గా పనిచేస్తున్న జ్యోత్స్న విద్యార్థులను, తల్లిదండులతో పాటుగా పనిచేసే టీచర్లను సైతం రోజూ వేధింపులకు గురిచేస్తుందని టీచర్లు వాపోయారు. స్కూల్ అవరణలో విద్యార్థుల ఎదుట చెప్పుకోలేని భాష పదజాలాన్ని వాడుతూ.. టీచర్లను తిడుతోందని, వారిస్తే జీతంలో కోతలు పెడుతూ.. ఇబ్బందులకు గురిచేస్తుందని, ఇలాంటి ప్రిన్సిపాల్‌పై ఇప్పటికే విద్యాసంస్థ యాజమానులకు ఫిర్యాదు చేశామని, వారు హెచ్చరించినా ఆమె వ్యవహారశైలిలో ఎలాంటి మార్పు రాలేదని వాపోయారు. ఇప్పటికైనా యాజమాన్యం తమ సమస్యలను పరిగణలోకి తీసుకుని ప్రిన్సిపాల్‌పై తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

వసూళ్లపై తగ్గిన ఆసక్తి !

శివారు పురపాలికల్లో పన్నుల టార్గెట్ రూ.353.66 కోట్లు

- 13 పట్టణాల్లో వసూలైంది రూ.262.92 కోట్లు
- పేరుకుపోయిన బకాయిలు రూ.90.73 కోట్లు
- 21 రోజుల్లో రూ.49.53 కోట్ల రాబడి



పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయం

సాక్షి,సిటీబ్యూరో: పట్టణాభివృద్ధితో సహా సిబ్బంది జీత భత్యాలు, తాగునీటి వీధిలైట్లు, పారిశుద్ధ్యం, డ్రైనేజీ వ్యవస్థ నిర్వహణకు ఎంతగానో తోడ్పాటును ఇస్తున్న వివిధ రకాల పన్నుల వసూళ్లపై పుర యంత్రాంగం నిర్లక్ష్యం చూపుతోంది. ఫలితంగా ఆర్థిక సంవత్సరం ముగిసే వరకే నిర్దేశించుకున్న లక్ష్యానికి అనుగుణంగా పన్నుల వసూళ్లపై దృష్టి సారించాల్సిన పుర కమిషనర్లు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారనే విమర్శలు ఎదుర్కొంటున్నారు.

◆ నగర శివారు 13 పురపాలిక సంఘాల్లో 2024–25 ఆర్థిక సంవత్సరంలో వివిధ రకాల పన్నుల రూపేణా రూ.353.66 కోట్లు లక్ష్యంగా నిర్దేశించుకున్నప్పటికీ, ఇప్పటి వరకు రూ.262.92 కోట్లు మాత్రమే వసూలు చేయకలిగింది. ఆర్థిక సంవత్సరం ముగిసి, దాదాపు నెల కావస్తున్నప్పటికీ, గతేడాది పన్నుల బకాయిలు రూ.90.73 కోట్లు పేరుకపోవడంపై జిల్లా అధికార యంత్రాంగం గుర్రుగా ఉన్నట్లు తెలుస్తోంది.

◆ రాష్ట్ర ప్రభుత్వం 2025–26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ముందస్తు పన్నుల చెల్లించే వారికి 5 శాతం రాయితీ ప్రకటించడంతో ఇప్పటి వరకు విధించిన టార్గెట్‌లో 13.73 శాతం పన్నులు అంటే రూ.49.53 కోట్లు ప్రజలు నేరుగా చెల్లించడంపై అధికార వర్గాల నుంచి సంతృప్తి వ్యక్తమవుతోంది. ఈ నెలాఖరు వరకు 5 శాతం రాయితీ వర్తింపు ఉండటంతో ప్రజల నుంచి పన్నుల చెల్లింపులు అంచనా మించగలవన్న ఆశాభావాన్ని వెల్లడిస్తున్నాయి.

13 పురపాలక సంఘాల్లో పన్నులు ఇలా..

నగర శివారు మేడ్చల్. మల్కాజిగిరి జిల్లాలో 4 మున్సిపల్ కార్పొరేషన్లు, 9 మున్సిపాలిటీలు ఉండగా.. ఈ పట్టణాల్లో ఇంటి పన్నుతో సహా వివిధ పన్నుల రూపేణా వసూలయ్యే నిధులతో పలు అభివృద్ధి పనులు చేపట్టేలా యంత్రాంగం కసరత్తు చేస్తోంది.

◆ మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలో మున్సిపల్ కార్పొరేషన్లు బోడుప్పల్‌లో రూ.32.51 కోట్లకు రూ.21.18 కోట్లు (65.15 శాతం) వసూలు కాగా.. పీర్జాదిగూడలో రూ.35.17 కోట్లకు రూ.31.99 కోట్లు (90.90 శాతం) పన్నులు, జవహర్‌నగర్‌లో రూ.14.64 కోట్లకు రూ.9.03 కోట్లు (61.68 శాతం), నిజాంపేట్‌లో రూ.75.21 కోట్లకు రూ.55.22 కోట్లు (73.42 శాతం) పన్నులు వసూలయ్యాయి. మున్సిపాలిటీలు పోచారంలో రూ.26.38 కోట్లకు రూ.19.49 కోట్లు (73.86 శాతం) పన్నులు వసూలు కాగా.. తూముకుంటలో రూ.17.20 కోట్లకు రూ.13.90 కోట్లు (80.79 శాతం), నాగారంలో రూ.23.62 కోట్లకు రూ.18.94కోట్లు (80.18శాతం), మేడ్చల్‌లో రూ.15.87 కోట్లకు, రూ.11.71 కోట్లు (73.77శాతం), కొంపెల్లిలో రూ.16.01 కోట్లకు, రూ.12.64 కోట్లు (78.98శాతం), ఘట్కేసర్‌లో రూ.12.26 కోట్లకు, రూ.7.59 కోట్లు (61.95శాతం), గుండ్లపోచంపల్లిలో రూ.17.26కోట్లకు, రూ.14.82 కోట్లు (85.91శాతం), దమ్మాయిగూడలో రూ.23.20 కోట్లకు,రూ.13.69 కోట్లు (59శాతం), దుండిగల్ మున్సిపాలిటీలో రూ.44.26 కోట్లకు, రూ.32.67 కోట్లు (73.82శాతం) పన్నులు వసూలయ్యాయి. జిల్లాలో మొత్తంగా రూ.353.66 కోట్లకు రూ. 262.92 కోట్లు (74.34 శాతం) వసూలయ్యాయి.

పన్ను చెల్లింపుపై రాయితీతో రూ.49.53 కోట్లు

13 పురపాలక సంఘాలకు సంబంధించి 2025–26 ఆర్థిక సంవత్సరంలో నిర్దేశించిన ఆస్తి, ఇతర పన్నుల వసూళ్లపై ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లా అధికార యంత్రాంగం 5 శాతం రాయితీ ప్రకటించింది. ఈనెల 30 వరకు ఆస్తిపన్నుతో సహా వివిధ పన్నులు చెల్లించిన వారికి 5 శాతం రాయితీని పుర యంత్రాంగం కల్పించింది. ఈ నేపథ్యంలో 21 రోజుల్లో 13 పురపాలక సంఘాల నుంచి వివిధ పన్నుల ద్వారా రూ.49.53 కోట్లు (13.73శాతం) వసూలైంది. ఈ అవకాశాన్ని పట్టణ ప్రజలు వినియోగించుకోవాలని పురపాలక యంత్రాంగం కోరుతోంది.

పన్ను చెల్లించి.. రాయితీ పొందండి



ఈ ఆర్థిక సంవత్సరానికి (2025–26) సంబంధించి ఆస్తిపన్నుతో సహా ఇతర పన్నులు ఏప్రిల్ 30 లోగా చెల్లిస్తే, 5 శాతం వర్తిస్తుంది. ఈ అవకాశాన్ని పట్టణ ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి. 2024–25 ఆర్థిక సంవత్సరంలో చెల్లించాల్సిన పన్ను బకాయిలు సకాలంలో చెల్లించాలి. లేదంటే అపరాధ రుసుము చెల్లించాల్సి ఉంటోంది. పన్నులు సకాలంలో చెల్లించి, పట్టణాభివృద్ధికి సహకరించాలి.

– రాధికాగుప్తా, జిల్లా అదనపు కలెక్టర్

రేపు భూ భారతిపై అవగాహన సదస్సు


రజని, తహసీల్దార్ ఘట్‌కేసర్

ఘట్‌కేసర్: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న భూ భారతి చట్టంపై ఏదులాబాద్‌లోని డీఎస్‌ఆర్ గార్డెన్‌లో శుక్రవారం అవగాహన కల్పించనున్నట్లు తహసీల్దార్ రజిని తెలిపారు. ఘట్‌కేసర్ తహసీల్దార్ కార్యాలయంలో ఆమె మాట్లాడుతూ.. ముఖ్యఅతిథిగా జిల్లా కలెక్టర్ గౌతమ్ హాజరై భూ భారతి చట్టం–2025లోని అంశాలపై రైతులకు అవగాహన కల్పిస్తారని, రైతులందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

రజతోత్సవ సభ ఏర్పాట్ల పరిశీలనకు వెళ్తూ..

స్థానిక నాయకులతో కేటీఆర్ కరచాలనం



ఘట్‌కేసర్: పట్టణంలోని బైపాస్ చౌరస్తాలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్‌కు బీఆర్ఎస్ నేతలు బుధవారం స్వాగతం పలికారు. బీఆర్ఎస్ స్థాపించి 25 ఏళ్ల పూర్తి చేసుకున్న సందర్భంగా ఈనెల 27న వరంగల్‌లో నిర్వహించనున్న బీఆర్ఎస్ రజతోత్సవసభ ఏర్పాట్లను పర్యవేక్షించేందుకు ఆయన వరంగల్ తరలి వెళ్లారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ నేతలు నవీన్‌ప్రకాష్, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ మాధవరెడ్డి, బీఆర్ఎస్ మండల కార్యదర్శి కొండల్‌రెడ్డి, అన్ను, షకీల్, కృపా, సునీల్, సిరాజ్ కేటీఆర్‌ను కలిసిన వారిలో ఉన్నారు.

మానవ అక్రమ రవాణాను అరికట్టాలి


జవహర్‌నగర్‌లో మానవ అక్రమ రవాణాపై రెండు రోజుల శిక్షణ కార్యక్రమం దృశ్యం

జవహర్‌నగర్: ప్రజ్వల స్వచ్ఛంద సంస్థ హైదరాబాద్, జిల్లా మహిళా, శిశు సంక్షేమశాఖ అల్వాల్ ప్రాజెక్ట్ ఆధ్వర్యంలో బుధవారం జవహర్‌నగర్‌లో మానవ అక్రమ రవాణాపై రెండ్రోజుల శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అల్వాల్ ప్రాజెక్టు సూపర్‌వైజర్లు ధనలక్ష్మి, శైలజలు మాట్లాడుతూ.. మానవ అక్రమ రవాణా అనేది ప్రపంచవ్యాప్తంగా అత్యంత వేగంగా విస్తరిస్తూ.. ఎంతో మంది అమ్మాయిల జీవితాలను నాశనం చేస్తున్న నేరపూరితమైన చర్య అన్నారు. ముందుగానే అడ్డుకుంటే ఆడపిల్లలను రక్షించుకోవచ్చన్నారు. పేద, మధ్యతరగతి వారు, ఉద్యోగం, ప్రేమ పెళ్లి, సినిమా అవకాశాల పేరుతో మోసాలకు గురవుతున్నారు. ప్రతి ఒక్కరూ దీనిపై అవగాహన పెంచుకుని అప్రమత్తంగా ఉండాలన్నారు. ప్రతి అంగన్‌వాడీ టీచర్ తమ పరిధిలోని మహిళలు, అమ్మాయిలకు మానవ అక్రమ రవాణాపై అవగాహన కల్పించాలన్నారు. ప్రజ్వల స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు, ట్రైనింగ్ కో–ఆర్డినేటర్ అంబర్ సింగ్, మిథాలిరాజ్, సుప్రియ, అల్వాల్ ప్రాజెక్టు అంగన్‌వాడీ టీచర్లు తదితరులున్నారు.

రోడ్డు ప్రమాదంలో గుర్తు తెలియని వ్యక్తి మృతి



మేడ్చల్‌రూరల్ : రోడ్డు ప్రమాదంలో గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందిన ఘటన మేడ్చల్ పోలీస్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మంగళవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తి ద్విచక్ర వాహనంపై నిజామాబాద్ నుంచి మేడ్చల్ వైపు వస్తుండగా.. గుర్తు తెలియని లారీ వెనుక నుంచి ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో అతడు అక్కడికక్కడే మృతి చెందాడు. ప్రమాదం జరిగిన తర్వాత లారీ డ్రైవర్ ఆపకుండా వెళ్లిపోయాడు. మృతుడి వయస్సు సుమారు 40 ఏళ్లు ఉన్నట్లు సమాచారం . మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆసుపత్రికి తరలించారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పహల్గాం ఉగ్రదాడిపై బీజేపీ నిరసన


నాగారంలో నిరసన చేపడుతున్న బీజేపీ నేతలు


మేడ్చల్‌లో..

కీసర: జమ్మూకశ్మీర్ పహల్గామ్‌లో జరిగిన ఉగ్రదాడిని నిరసిస్తూ నాగారంలో బీజేపీ నేతలు కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహించారు. మృతిచెందిన వారి ఆత్మకు శాంతి చేకూరాలని, ఈ హింసాకాండకు పాల్పడిన ఉగ్రవాదులకు కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. నాగారం మున్సిపాలిటీ మాజీ చైర్మన్ చంద్రారెడ్డి, బీజేపీ నేతలు నాగరాజుయాదవ్, రవీందర్‌రెడ్డి, శ్రీనివాస్, వేణుగోపాల్, శ్యామ్‌గోపాల్, వెంకటేశ్వర్‌రావు, భువనేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

మేడ్చల్: కశ్మీర్‌లోని ఫహల్గామ్‌లో ఉగ్రదాడిలో మృతిచెందిన పౌరులకు మేడ్చల్‌లో బీజేపీ నేతలు నివాళులర్పించారు. ఉగ్రవాద చర్యలను నిరసిస్తూ నల్ల బ్యాడ్జీలు ధరించి జాతీయ రహదారిపై ర్యాలీ చేపట్టారు. త్వరలోనే ప్రభుత్వం ఉగ్రవాదులకు తగిన గుణపాఠం చెప్పాలన్నారు. బీజేపీ నేతలు శైలజ, కిషన్‌రావు, ప్రభాకర్‌రెడ్డి, సుధాకర్‌రెడ్డి, శ్రీకాంత్, ప్రేమ్‌దాస్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ప్రభుత్వ పాఠశాల వార్షికోత్సవం


ఆకట్టుకున్న విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శన


పోచారం: కొర్రెముల్‌లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల వార్షికోత్సవం ప్రధానోపాధ్యాయురాలు వరలక్ష్మి అధ్యక్షతన ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా మండల విద్యాధికారి శ్రీధర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పాఠశాల అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం నిధులు సమకూర్చడం అభినందనీయమన్నారు. వేడుకల్లో భాగంగా విద్యార్థినీవిద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక అంశాలు ఆహూతులను విశేషంగా అలరించాయి. ఘట్‌కేసర్ జెడ్పీహెచ్ఎస్ హెచ్ఎం పాపిరెడ్డి, ప్రతాపసింగారం జెడ్పీహెచ్ఎస్ హెచ్ఎం రవికుమార్, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

నేటి నుంచి చీర్యాల బ్రహ్మోత్సవాలు


చీర్యాల దేవాలయం

కీసర : భక్తుల కొంగుబంగారంగా పేరొందిన చీర్యాల లక్ష్మీనృసింహ్మస్వామి దేవస్థానంలో నేటి నుంచి 27 వరకు సప్తదశ (17)వ వార్షిక బ్రహ్మోత్సవాలు ప్రారంభం కానున్నాయి. ఈ మేరకు బ్రహ్మోత్సవాల సందర్భంగా దేవస్థానం ఆధ్వర్యంలో అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు.

ఏర్పాట్లు పూర్తి చేశాం..



బ్రహ్మోత్సవాల కోసం వచ్చే భక్తులకు అన్ని రకాల సౌకర్యాలు కల్పిస్తున్నాం. తాగునీరు, స్వామివారి దర్శనం కోసం క్యూలైన్లు, వేసవిని దృష్టిలో ఉంచుకుని చలువ పందిళ్లు, ఉచిత అన్నప్రసాద వితరణ, రవాణా సౌకర్యం, వాహనాల పార్కింగ్, మెరుగైన పారిశుద్ధ్య నిర్వహణ, తదితర సౌకర్యాల కల్పనకు పెద్దపీట వేస్తున్నాం. ఈ మేరకు ఏర్పాట్లను పూర్తి చేశాం.

– మల్లారపు లక్ష్మీనారాయణ, ఆలయ చైర్మన్

బట్టతలకు మందు ఇస్తామని బురిడీ..

పోలీసుల అదుపులో నిర్వాహకుడు


ఉప్పల్ భగాయత్ శిబిరం వద్ద ఎగబడిన జనం

ఉప్పల్: బట్టతలకు మందు అంటూ ఉప్పల్ భగాయత్‌లో ఏర్పాటు చేసిన శిబిరం గుట్టును ఉప్పల్ పోలీసులు రట్టు చేశారు. ఈ ఘటనకు సంబంధించిన వివరాలు పోలీసులు, బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.. సూర్యాపేట జిల్లా రాజానాయక్ తాండాకు చెందిన హరీష్ అనే వ్యక్తి బట్టతలకు మందు వేస్తామంటూ.. ఇన్‌స్టాగామ్‌లో ప్రకటన చేసి, ఉప్పల్ భగాయత్‌లో శిబిరం ఏర్పాటు చేశాడు. దీంతో బట్టతల ఉన్న వారంతా దూర ప్రాంతాల నుంచి వచ్చిన వేలాది మంది శిబిరానికి ఎగబడ్డారు. రూ.300లకు షాంపూ, లేపనానికి రూ.700 అంటూ.. మొత్తం రూ. ఒక్కోక్కరి వద్ద రూ. 1000 వరకు వసూలు చేస్తున్నారు. వందలాది మంది గుమిగూడటంతో గందరగోళం ఏర్పడింది. దీంతో సమాచారం అందుకున్న ఉప్పల్ పోలీసులు బట్టతలకు మందేంటి అని ఆరా తీశారు. అదంతా ఫేక్ అని తేలడంతో నిర్వాహకులను పోలీస్‌స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. దీంతో శిబిరానికి వచ్చిన వారంతా వెనుదిరిగారు.

నర్సింహారెడ్డి కళాశాలకు డీఎస్టీ నిధులు

- రూ.47 లక్షలు కేటాయించిన కేంద్ర ప్రభుత్వ సంస్థ
- అంధులకోసం ఆవిష్కరించనున్న డాక్యుమెంట్ స్కానర్


కేంద్ర సంస్థ విడుదల చేసిన నిధుల పత్రాలను చూపుతున్న కళాశాల యాజమాన్యం

మేడ్చల్‌రూరల్: గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ పరిధి మైసమ్మగూడలోని నర్సింహారెడ్డి ఇంజినీరింగ్ కళాశాల అధ్యాపకుడి ప్రాజెక్ట్ తయారీకి కేంద్ర ప్రభుత్వ సంస్థ డీఎస్టీ రూ.47లక్షల నిధులు మంజూరు చేసింది. కళాశాలలో సీఎస్‌ఈ విభాగం అధ్యాపకులుగా పనిచేస్తున్న డా. పి. దిలీప్‌కుమార్‌రెడ్డి కేంద్ర సంస్థ అయిన డిపార్ట్‌మెంట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీలోని సీఈఈడీ విభాగంలో టీఐడీఈ పథకానికి దరఖాస్తు చేసుకున్నారు. అంధులకు ఉపయోగపడేలా డాక్యుమెంట్ స్కానర్‌ను ఇంకా మెరుగుపరిచి, దానితో ఈ–బుక్‌లు, బ్రెయిలీ పాఠ్యరూపాల్లో డాక్యుమెంట్ల తయారీ ప్రాజెక్ట్‌కు మొత్తం రూ.47 లక్షల నిధులు కేటాయించగా విడతల వారీగా నిధులు మంజూరు చేయనున్నారు. ఈ సందర్భంగా బుధవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ప్రాజెక్ట్ పరిశోధకులు దిలీప్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ.. అంధులకు సమాచారం అందుబాటులో లేకపోవడం వల్ల వారి విద్య, వృత్తి, వ్యక్తిగత అభివృద్ధి లేకపోవడం అనే సమస్యకు పరిష్కారం చూపడం కోసం ప్రాజెక్టు ఎంపిక చేసినట్లు వివరించారు. బహుభాషా బ్రెయిలీ, అచ్చువేసే సదుపాయాలను అందించడం ద్వారా పరికర వినియోగాన్ని విభిన్న భాషల్లో ప్రపంచవ్యాప్తంగా ఉన్న ప్రజలకు విస్తరించడం, చూపు ఉన్నవారితో సమానంగా విద్యను అందించడం, డిజిటల్ టెక్ట్స్‌ను స్వయంగా బ్రెయిలీగా మార్చుకునేలా చేయడం ద్వారా వారిలో స్వతంత్రంగా జీవించే సామర్థ్యం పెంపొందుతుందన్నారు. కళాశాల డైరెక్టర్ మోహన్, చైర్మన్ నర్సింహారెడ్డి, కార్యదర్శి త్రిశూల్‌రెడ్డి, కోశాధికారి త్రిలోక్‌రెడ్డి, ప్రిన్సిపాల్ లోకనాథం, హెచ్ఓడీలు ఆయనను సన్మానించి అభినందించారు.

సమస్యల పరిష్కారానికి కృషి

కాప్రా: సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి అన్నారు. ఏఎస్‌రావునగర్ డివిజన్‌లో రూ.3 కోట్లతో చేపట్టిన పలు అభివృద్ధి పనులకు స్థానిక కార్పొరేటర్ సింగిరెడ్డి శిరీషారెడ్డితో కలిసి బుధవారం శంకుస్థాపన చేశారు. సింగిరెడ్డి సోమశేఖర్ రెడ్డి,మహిపాల్‌రెడ్డి, మణెమ్మ, యాకయ్య పాల్గొన్నారు.

ఎండలతో తస్మాత్ !

- వడదెబ్బకు గురికాకుండా ముందస్తు చర్యలతో ఆరోగ్యం పదిలం
- అప్రమత్తతే మేలు అంటున్న వైద్య నిపుణులు
- వృద్ధులు, చిన్నారులపై ప్రత్యేక శ్రద్ధ అవసరం


సేదతీరేందుకు చెరుకు రసం బండి వద్ద ప్రజలు

ఘట్‌కేసర్: రోజురోజుకు ఎండ తీవ్రత పెరుగుతోంది. ఏప్రిల్‌లోనే మే నెల నాటి ఎండలు తలపిస్తుండటంతో ప్రజలు బెంబేలెత్తుతున్నారు. ఉదయం 9 నుంచే సూర్యుడి ప్రతాపం కారణంగా ప్రజలు ఇళ్లలో నుంచి బయటకు రావడానికి జంకుతున్నారు. ఎండల్లో బయటకు వెళ్లకూడదని, తప్పనిసరైతే జాగ్రత్తలు పాటించాలని, లేదంటే ప్రాణాలకు ముప్పు ఏర్పడుతుందని వైద్యులు సలహాలిస్తున్నారు. ఈ నేపథ్యంలో వేసవిలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రత్యేక కథనం...

వడదెబ్బతో శరీరం నిస్తేజమై..

వడదెబ్బకు గురైన వారి శరీర ఉష్ణోగ్రత 104 డిగ్రీల ఫారన్‌హీట్‌కు చేరుకుంటుంది. ఎండలో తిరగడం, తక్కువ నీరు సేవించడం, ద్రవ పదార్థాలు తీసుకోకపోవడం, మద్యం సేవించడంతో వడ వడదెబ్బ తగులుతుంది. అధిక ఎండ శరీరానికి తగిలిన కారణంగా శరీరంలోని ఉష్ణోగ్రత విపరీతంగా పెరిగి నీరు ఆవిరై లవణాలు కోల్పోతారు. శరీరం పొడిబారిన పడి అపస్మారక స్థితికి చేరుకుంటారు. సమయానికి వైద్యం అందకుంటే తీవ్రత పెరిగి శరీరం నిస్తేజమై ప్రాణం పోయే ప్రమాదం ఉంది.

లక్షణాలు...

నీరు తాగకుండా ఎక్కువ సమయం ఎండలో తిరిగినప్పుడు కళ్లు తిరిగి పడిపోవడం, ఒళ్లు కాలిపోవడం, ఫిట్స్ రావడం, బీపీ తగ్గడం, చెమటలు రావడం, మూత్రం రాకుండా ఉంటే వడదెబ్బ సోకినట్లు గుర్తించాలి. రక్త ప్రసరణ పెరిగి, తగ్గి బీపీ తగ్గుతుంది. విపరీతమైన తలనొప్పి వస్తుంది.

ఉపశమనం ఇలా...

మధ్యాహ్నం నుంచి సాయంత్రం 4 గంటల మధ్య బయటకు వెళ్లకూడదు. రోడ్ల పక్కన విక్రయించే ఆయిల్‌ఫుడ్, కూల్‌డ్రింక్స్, కాఫీ, టీలకు దూరంగా ఉండాలి. ప్రయాణికులు ముఖానికి రుమాలు, తలపై టోపీ, మహిళలు స్కార్ఫ్స్, కళ్లద్దాలు ధరించాలి. ఎండ తీవ్రతను తగ్గించే కాటన్, తెలుపు రంగుతో వదులుగా ఉండే దుస్తులను ధరించాలి. శరీరంలోని నీరు డీహైడ్రేషన్ కాకుండా పండ్లరసాలు, తగినంత నీటిని సేవించాలి. ఆహారంలో ఉల్లి ఎక్కువగా కొవ్వు, మసాలా తక్కువగా తీసుకోవాలి. ఇంటి నుంచి బయటకు వెళ్లేటప్పుడు తప్పనిసరిగా గొడుగు వాడాలి. వేసవిలో మాంసాహారం, మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి. ఉదయం 10 లోపు పనులు పూర్తి చేసుకోవాలి.

తీసుకోవాల్సిన చర్యలు..

వడదెబ్బకు గురైన వారికి త్వరితగతిన ప్రాథమిక చికిత్సను అందించాలి. స్పృహ కోల్పోయిన వారిని చల్లని గాలి తగిలేలా చూసుకోవాలి. శరీరం చల్లబడేలా తడిగుడ్డతో తుడవాలి. చల్లని నీటిని తాగించాలి. ఆలస్యం చేయకుండా ఆసుపత్రికి తీసుకెళ్లాలి.

అప్రమత్తంగా ఉండాలి...



ఉప్పు, పంచదార కలిపిన నీరు, కొబ్బరి నీళ్లు, పండ్ల రసాలు, స్వంతంగా ఇంట్లో తయారు చేసుకున్న మజ్జిగ, నీరు ఎక్కువగా ఉండే పుచ్చకాయలాంటి పండ్లు, నిమ్మరసం సేవించాలి. వృద్ధులు, చిన్నారులు, గర్భిణులను ఎండలోకి వెళ్లనీయకూడదు. సాధ్యమైనంత వరకు ఎండలో ప్రయాణం చేయకూడదు. అప్రమత్తంగా ఉండాలి. తక్షణమే ప్రాథమిక చికిత్స అందించాలి.

– డాక్టర్ ధారావత్ కిరణ్‌కుమార్